
# చట్టి - కుండలు

_వి.పి.బి.నాయర్



**ఒక వంట ఇంట్లో వున్న చట్టి కుండలు పరస్పరం అంటుకోకుండా, తట్టుకో కుండా వుండవన్న సామెత వుంది.**

కానీ అందులో ఒక చిక్కుంది. చట్టీ, కుండ ఎంత కావాలంటే అంతగా ముట్టుకోవచ్చు. తట్టుకోవచ్చు. కానీ పగిలిపోకూడదు. ఎందుకు పగిలిపోకూడదు!

## నవ్వుల కథల పోటీలో మొదటి బహుమతి



# పొందిన కథ

ఎందుకంటే పగిలిపోయాక తట్టుకోవడానికి, ముట్టుకోవడానికి వీలుండదుకదా? ఎంత గొప్ప కుంభరాశి కుండ అయినా ఎంత ప్రసిద్ధమైన మిధునరాశి చట్టి అయినా పగిలిపోయాక ఎలాంటి ప్రభుత్వం వచ్చినా పోయినా ఏ వంట ఇంట్లోనయి నా పెట్టుకొమ్మని ఆదేశించడానికి వీలులేదు. అది వంట ఇంటి నుంచి బైటికి ఫ్లయింగ్ సాసర్‌లాగ ఎగిరిపోవాల్సిందే. అయితే ఈ అంటు తట్టుల గురించి ఎవరు అంటుతున్నారు? ఎవరు తట్టుతున్నారు? అన్న సందేహం కలగవచ్చు. చట్టికి మామూలుగా బలం ఎక్కువయినా కూడా కుండ ఆకారం చూచి భయపడి స్వతహాగా అంటుకోవడానికిగాని, ముట్టుకోవడానికి ధైర్యం చాలదు. అందుకే మెల్లగా, చిన్నగా అప్పుడప్పుడు తాకీ తాకవట్లు వుంటుంది. కానీ కుండ అయితే దానికి ప్రతిస్పందనగా కొంచెం గట్టిగానే చట్టిని తట్టుతుంది. అంటుతుంది. అయితే ఇలాంటి తట్టుకోడాన్ని, ముట్టుకోడాన్ని మానవ భాషలో తిట్టుకోవడం, కొట్టుకోవడం అని, తర్జుమా చేస్తే తప్పులేదు.


ఇప్పుడు మనం చిన్నగా కథలోని పాత్రలను విశ్లేషిద్దాం. మొదటగా చట్టి. వెడల్పు మూతి వుండడం, దేనినీ దాచుకోలేకపోవడం, లోపల వున్నది తేలిగ్గా బైటికి కనబడిపోవడం అనే ఈ మూడు లక్షణాలు వున్నా చట్టి ఫ్రాంక్ అండ్ ఫోర్త్ రైట్ పురుష పాత్ర ఇంకకుండా నోరు చిన్నదిగా వుండడం, పొట్ట పెద్దదిగా వుండటం అందువల్ల చాలాసేపు ఆవిరి వదలడానికి అవకాశం వుంది. చాలా రహస్యాల్ని అది లోపల దాచుకోవచ్చు. ఆకారంలో కుండ మధ్య వయసున్న స్త్రీలా, నిత్య గర్భిణిలా వుంటుంది. ఆడవాళ్ల ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మనం మాత్రం కుండకు భార్య పాత్ర ఇచ్చేద్దాం. ఆకార వికార సమర్ధనలున్నాయికదా!

ఈ చట్టి కుండ ఉదాహరణ నాకు, నా భార్యకు బాగా సరిపోతుంది. అయితే చట్టి మాదిరి నాకు ఎత్తు తక్కువకాదు. మొత్తం పరిమాణం దృష్ట్యా ఆమె నాకంటె ఎక్కువగా వున్నా ఎత్తులో ఆమెకంటె నేను మూడంగుళాలు ఎక్కువే. నాకంటే ఆమెకు పరిమాణం ఎక్కువ కావడానికి తగిన కారణాలుండాలికదా? దానిలో ముఖ్యమైన రెండు కారణాలు వేరే ఏమీకాదు. ఒకటి మటన్ బిరియానీ, రెండోది చికెన్ వేపుడు. కానీ ఆమెకు శాఖాహారముపై మక్కువ లేదన్న ఒక అపోహ మీకు కలిగించాలని కాదు నా ఉద్దేశ్యం. తిండి విషయంలో ఆమె దృష్టిలో రెండే రెండు రకాలున్నాయి. ఒకటి రుచికరమైనది. రెండు రుచి తక్కువ అయినది. గడ్డి రుచి కంటే ఎక్కువ రుచి ద్విపాదుం, చతుష్పాదుల మాంసానికి వుంటుంది అనే విషయంలో లోక జనాభాలో 80 శాతంమంది నాతో ఏకీభవించకుండా వుండడానికి వీల్లేదు. ఇది సాధార

ణ ప్రకృతి సత్యాలలాగా ఎలాంటి దాపరికం లేని సత్యం. కానీ ప్రకృతి సత్యాలకు విపర్యాయాలు లేవా? పైకి విసిరిన ఏ వస్తువైనా కిందికి వస్తుందన్నది సత్యమే. అంటే పైకి వెళ్లేదంతా కిందికి రాక తప్పదు. కానీ బాహ్యాంతరిక్షం వరకు ఎగురుతూ ఎగురుతూ పోయినా వస్తువులు స్వయంగా తిరిగిరావు. ఛీ ఛీ! ఈ ఉదాహరణ అంత బాగాలేదు. మనం ప్రకృతి సత్యాల గురించి మాట్లాడేటప్పుడు భూమ్యాకర్షణ పరిధిని మించి మాట్లాడ్డం మర్యాదకాదు. అందుకే ఆకాశంవైపు దూసుకుని పోతున్న ధరల గురించి ఆలోచిద్దాం. వాటిని కిందికి తీసుకుని రావడానికి లేక వున్న చోటునే ఆపి పెట్టడానికి మన్మోహన సింహం కాదు, సాక్షాత్తు కె.పి.యస్.గిల్ అనుకుంటే కూడా సాధ్యం కాదని మానవ కోటికి తెలుసు. అయితే ఆహారం గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ కథ దారి తప్పి అరణ్యంలోకి పోయినట్లుంది. మన కథ విషయం చట్టీ, కుండ కదా! నా ఇంట్లో చట్టిని నేనే అని ఒప్పుకోవడంలో నాకు సిగ్గుగాని, అవమానంగాని లేదు. కారణం ఏమిటంటే చాలా కుటుంబాలకు ఈ వెలితిలేని ప్రకృతి సత్యమే వర్తిస్తుంది. కొంతమంది భర్తలు అంటారు "ఈ ఇంటి యజమానిని నేనే... ఈ విషయం చెప్పడానికి నా శ్రీమతి అనుమతి వుంది" అని.

మరికొంతమంది "నా కుటుంబంలో అభిప్రాయభేదాలు వచ్చే సమస్యేలేదు. కారణం ఏమంటే ఈ ఇంట్లో కీలకమైన నిర్ణయాలన్నీ నేనే తీసుకుంటాను. రాష్ట్రస్థాయిలో దూరదర్శన్ అయిదు ఛానల్స్‌ను ప్రారంభించాలా? వద్దా?... కేంద్ర





## డిమాండ్

నటన అంటే ఏమిటో చేసి చూపించిన దర్శకుడు కె.విశ్వనాథ్. తనదంటూ ఓ ప్రత్యేకతగల వ్యక్తి. శుభసంకల్పంలో ఆయన ధరించిన రాయుడి పాత్రకు విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'ద్రోహి'లో ప్రత్యేక పాత్ర ధరిస్తున్న ఈ కళాతపస్వికి చాలామంది దర్శకులు, నిర్మాతలు తమ చిత్రాల్లో నటించమని అడుగుతున్నారు దర్శకుడిగా సాధించిన విజయాలు కోకొల్లలైతే నటుడుగా ఎన్ని అవార్డులు అందుకుంటాడో ఈ కాశీనాథుని విశ్వనాథుడు. వేచి చూద్దాం.


—కృష్ణాజీ

ప్రభుత్వం స్టార్ టీవీకి వ్యతిరేకంగా చర్యలేమైనా మొదలుపెట్టాలా వద్దా? పార్లమెంటులో విజయవంతమయ్యే ఇంపీచ్‌మెంట్ ప్రొసీడింగ్స్ మళ్లీ ఎవరిమీదయినా ప్రయోగించి చూద్దామా లేదా? రష్యాతోగానీ, అమెరికాతోగానీ భారత్ క్రికెట్ ఆడాలా వద్దా? గవర్నరు పదవి రద్దు చేయాలా వద్దా? భారతదేశంలో అన్ని నదుల్నీ కలపాలా వద్దా? అనే చాలా ప్రధాన చర్చలలో నా భార్య నాకు కొంచెం కూడా వ్యతిరేకించే అభిప్రాయం చెప్పదు. చిన్న చిన్న విషయాల్లో నా భార్య తీసుకునే నిర్ణయాలలో నేను జోక్యం కలిగించుకోను. పిల్లలకేం పేరు పెట్టాలి? ఇంటికి ఎలాంటి టివి, విసిఆర్, ఫ్రిజ్ కారు మొదలగునవి కొనాలి? పిల్లలు పెరుగుతున్నప్పుడు వాళ్లు ఏ పై చదువులు చదవాలి? వాళ్ల జీవిత భాగస్వాములుగా ఎలాంటివారు రావాలి? ఎవరైనా బర్త్‌డే పార్టీలకుగానీ, పెళ్లిళ్లకుగానీ పిలిస్తే వాటికి పోవాలా వద్దా? ఒకవేళ పోవాలంటే ఎలాంటి కానుకల్ని తీసుకునివెళ్లి మనసులో తిట్టుకుంటూ ముఖంమీద చిరునవ్వుతో ఇయ్యాలి!? అనే చిల్లర విషయాల్లో నేను జోక్యం కలిగించుకోను" అని చెపుతారు.

ఈ రకంగా నా ఇంట్లో భారత రాజ్యాంగంలోని కంకరెంట్ లిస్టు లాంటి బోన్ ఆఫ్ కంటెన్షన్ లేకపోవడంవల్ల నా ఇల్లు స్వర్గమే అని అనాలని నాకు కోరికగా వున్నా నా మనస్సాక్షి మాత్రం దానికి పూర్తిగా అంగీకరించడంలేదు.

"చట్టి కుండ అయితే తిట్టుకుంటూ, అంటుకుంటూ వుంటాయి" అని నా భార్య అప్పుడప్పుడు అంటుంది. "కానీ ఈ తట్టు, అంటు కార్యక్రమంలో ఏదయినా పగిలితే ఏమవుతుంది" అని నేనడిగితే "అలాగేం జరగదు. ఈ చట్టి ఈ కుండ మట్టితో చేసినవి కావు స్టీలు... లేదా అల్యూమినియంతో చేసినవి అనుకోండి" అని ఆమె అనేది.

ఒకసారి దానికి నేను జవాబు చెప్పాను "ఏమయినా అల్యూమినియమ్ నేనే అని ఒప్పుకుంటాను. నీవు స్టీలు అందుకే పరస్పరం తిట్టుకుంటూ అంటుకుంటూ వుంటే సొట్ట పడేది అల్యూమినియమ్‌కే కదా!" అని.




ఆమెకది కొంచెం కూడా రుచించలేదు.

"మీ ఉద్దేశ్యం నేను లావనేకదా! నా బరువు నేనే మోసుకుంటాను. పెళ్లి తరువాత బరువు తగ్గించుకుంటానని నేను వాగ్దానం ఏమీ చేయలేదే. కానీ మీరేదో పెద్ద ఎండుటాకు అని అనుకున్నారా? శరీరం పుష్టిగా వుండాలంటే మనసు నిష్కల్మషంగా వుండాలి"

"నేను కొట్లాడ్డానికి చెప్పడంలేదు. నేను లావెక్కకుండా వుండడం నాకు మంచి మనసులేక కాదు. తిండిలో మంచి కంట్రోల్, వ్యాయామం చెయ్యడం... అలా కాకుండా నీలాగే సుఖంగా భోంచేసి కంటినిండా నిద్రపోతే ఒళ్లు రాకుండా వుంటుందా?"

"నా ఒళ్లు నేను భరిస్తాను"

"కానీ భరించాల్సింది నేను కదా?"

ఇది మా తట్టు, అంటులకు ఒక చిన్న ఉదాహరణ అన్నమాట. మా పోట్లాట ఈ రకంగా మొదలైనా అప్పుడప్పుడు రెండు మూడురోజులవరకు అలాగే సాగవచ్చు. అప్పుడు మా మధ్య ఆహార, విహార తదితర దైనందిన సంబంధాలు కూడా వర్షాకాలంలో టెలిఫోన్ సర్వీసుల మాదిరి అస్తవ్యస్తం కావచ్చు. అలాంటి సంబంధరహిత మౌనదివాల్లో కూడా అవసరమైన కొన్ని విషయాలు మాట్లాడుకోక తప్పదు. చిన్న చిన్న ప్రశ్నలకు చిన్న చిన్న జవాబులు కూడా లేకపోతే కుటుంబ జీవితం ముందుకెలా సాగుతుంది. మమ్మల్ని శ్లాఘించాల్సిన ఒక గొప్ప విషయం కూడా వుంది. ఇంటికి వచ్చే అతిధులకు మా శీత సమరం గురించి తెలిసే అవకాశమే ఇయ్యం.

ఇలాంటి లఘు కురుక్షేత్రాలు మా హనీమూన్‌లోనే ప్రారంభమయ్యాయంటే హనీమూన్ తేనెలో ఎప్పటికీ పెళ్లికాని ఆ తేనెటీగలు దురుద్దేశ్యంతో 'సీమ మిరపకాయ రేణువుల్ని' కూడా కలిపి వుండవచ్చునని గట్టిగా అనుకోవాల్సి వస్తుంది.

కల్తీలేని వస్తువులు ఈ ప్రపంచంలో ఎక్కడా దొరకవన్న ప్రస్తుత పరమార్థానికి అవిభాజిత అంశమేనా ఇలాంటి తేనె ఆవిర్భావం! లేక ఈ కార్మిక తేనెటీగల మధ్యలో తీవ్రవాద తేనెటీగలు చొరబడ్డాయేమో అన్నదానికి నిదర్శనమా?

నా ప్రియమైన కుండకి ఒక ప్రత్యేక దౌర్బల్యముంది. ఆమె దగ్గరి బంధువుల గురించి ఆమె ఎలాంటి విమర్శనూ సహించదు. ఆమె తల్లిదండ్రులు, నలుగురు సోదరులు ఈ ప్రపంచంలో వుండే మామూలు మనుష్యుల లాంటి వారు కాదని ఆమె దృఢమైన నమ్మకం. సెక్స్ గురించి మామూలుగా మాట్లాడడం ఇష్టంలేని ఆమెకు ఆమె తల్లిదండ్రుల మధ్యలో కూడా సెక్స్ వుండేదని ఈ చట్టి చెప్తే ఆమెకది మంచిగా అనిపించదు.

"ఛీ! ఛీ! నా తల్లిదండ్రుల మధ్యలో అలాంటి

వేం లేదు''

''అయితే మీ పంచపాండవులెలా పుట్టారు?''

''అంటే నేను స్త్రీని కాననే కదా మీరనేది?''

ఇలాంటి వాగ్వివాదం ముదిరి మూడు నాలుగు మౌనదినాలు గడిచిపోయేవి.

మాకు మా ఇరువురు బిడ్డలు కూడా కుండలే. కొన్ని సమయాల్లో నాకనిపిస్తుంది. 'ఈ ప్రపంచంలో మగవాడిగా పుట్టే దౌర్భాగ్యం ఎవరికీ లేకపోతే ఎంత బాగుంటుంది' అని. అప్పుడు ఈ కుండలన్నీ ఒకదానికొకటి ముట్టుకుని, కొట్టుకుని పగిలిపోయాక ఆ బ్రహ్మదేవుడు అనుకుంటే మళ్లీ ఒకసారి అంటని, తట్టని చట్లు, కుండలు సృష్టించగలుగుతాడేమో?

మా ఇద్దరు లేతకుండలకు కూడా తల్లి కుండ స్వభావమే సంక్రమించింది.

నేను పట్టి హోంలీటైప్. ఇంట్లో వండే ఏ తిండి అయినా నాకిష్టమే. బైట హోటల్లో, రెస్టారెంట్‌లో భోంచేయాలంటే నేను వ్యతిరేకం. ఒక్కరోజు బైట భోంచేసే డబ్బుతో మూడురోజులు ఇంట్లో పండుగ చేసుకోవచ్చని నా అభిప్రాయం.

''హోటల్లో బిల్లు పెద్దది కావడానికి కారణం భోజనంవల్ల కాదు, మీ తాగుడువల్ల''

దానికి జవాబియ్యకుండా వుంటే ఆమె కూడా కాల్పుల విరమణకు సిద్ధంగా వుండదు.

''ఎప్పుడో ఒకసారి హోటల్లో భోంచేస్తే ఆకాశమేం పడిపోదు. మీకున్న స్నేహితులతో దాదాపు ఎక్కువమంది భార్యపిల్లల్ని హోటల్‌కి కనీసం నెలకు నాలుగయిదుసార్లు తప్పకుండా తీసుకునిపోతారు. మాకు కూడా అప్పుడప్పుడు ఔటింగ్ అవసరం లేదా?''

ఇలాంటి విషమ సంధులలో 'మౌనమే బంగారం' అనే సిద్ధాంతాన్ని నేను పాటిస్తాను. కాని ఆ రకంగా ధవళ పతాకాన్ని నేను చూపిస్తున్నా కంటికిముందు అరుణాంబరాన్ని చూస్తున్న వృషభసిరునిలా నా 'కుండ' ప్రవర్తిస్తుంది.

ఈ విషయంలో నా మొదటి లేతకుండ అభిప్రాయం ఇది.

''ఇంట్లో చేసేది ఎంత రుచిగా వున్నా హోటల్‌లో చేసేది ఎంత అరుచిగా వున్నా నాకు హోటల్ భోజనమే ఇష్టం''. హెరిడిటీ అనే పాపఫలానికి ఇంత బలం వుంటుందా? అని ఆలోచిస్తున్నప్పుడు గంజి తాగి తృప్తి పడే నాకు చాలా దుఃఖంగా వుంటుంది.

ఇంతవరకు చదివాక పాఠకులకు నామీద సానుభూతి కలుగుతుందేమో. కానీ నిజం చెప్పాలంటే నా కుటుంబ జీవితం అంత కష్టంభరితమేమీకాదు. మా ఇరవై సంవత్సరాల వైవాహిక జీవితం మొత్తంమీద సుఖంగానే గడిచిపోయింది. భోంచేసేటప్పుడు అన్నంలో ఎప్పుడైనా ఒకసారి రాయి పంటికి తగిలితే అది అంత అసాధారణం కాదనీ, అరుచ్యం కాదనీ నేను అనుకుంటున్నాను. వంట ఇంట్లో పనిచేసే అబ్బాయిగానీ, అమ్మాయిగానీ పూర్తి గుండు కాకపోతే ఎప్పుడో ఒక అమావాస్య రోజు వాళ్ల చేసే వంటకంలో ఒక వెంట్రుక పడితే అది అంత అక్షంతవ్యమైన అపరాధంకాదు. తలమీద వున్న వెంట్రుకల్ని ఎంతో వాత్సాల్యంతో పెంచుతున్న మనలాంటి వాళ్లకు దానిని క్షమించకపోవడం కొంచెం కూడా సమంజసంకాదు. మధురమైన జీవితంలో అప్పుడప్పుడు కారం, చేదు, పులుపు ఒక దొంగ మారిది పిలవని పేరంటానికి రాకపోతే మనకంతా ఎప్పుడో మధుమేహం వచ్చి వుండాలని నేను అనుకుంటున్నాను. కానీ కొంచెం తెలివి వున్న ఏ డాక్టరూ నాతో ఏకీభవించడు. ''అనవసరంగా మనిద్దరం అప్పుడప్పుడు ఎందుకిలా పోట్లాడుకుంటున్నాం? దేవుడి దయవల్ల జీవితంలో కావలసినవన్నీ మనకున్నాయి. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు వున్నారు. అందరకు టచ్‌వుడ్ మంచి ఆరోగ్యం వుంది. మన మధ్యలో ఎలాంటి సమస్యల్లేవు. అయితే మనం ఎందుకు పోట్లాడుకుంటున్నాం?'' అని 'నన్స్ ఇన్ ఎ బ్లూ మూన్' నా శ్రీమతి సెల్ఫ్ రియలైజేషన్ వచ్చినట్లు అడుగుతుంది.


''అదే ప్రశ్న నేనూ నిన్నడుగుతున్నాను'' అని నేనంటే

''చూశారా! చూశారా! నేనేదయినా అడిగితే దానికి సమాధానం ఇయ్యకుండా మళ్లీ అదే ప్రశ్న నన్ను వేస్తారు. మనమిక కొంచెం సుఖంగా బ్రతగ్గాడదూ?''

నాకు పెద్దగా ఏం అక్కర్లేదు. మీరు నన్ను కొంచెం అర్థం చేసుకుంటే చాలు. నాకు కూడా ఫీలింగ్స్ వున్నాయి. చిన్న చిన్న విషయాలు చాలు నన్ను సంతోషపెట్టడానికి. అలాగే చిన్న చిన్న విషయాలే నాకు బాధ కలిగిస్తాయి. అందుకే మీరు నన్ను ఒక మానవ స్త్రీగా, ఒక భార్యగా రికగ్నయిజ్ చేస్తే మాత్రం చాలు. మన జీవితం ఎంతో హాయిగా వుంటుంది. నాకు పెద్ద పెద్ద డిమాండ్స్ ఏమీలేవు. నేను అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టను. వేరే ఆడవాళ్లు ఏం చేస్తారో మీకు తెలుసుకదా! నేను అలాంటివి ఏమయినా అడుగుతున్నానా? నాకేమీ వద్దు. కొద్దిగా హార్ట్‌నెస్, కొద్దిగా పీస్ ఆఫ్ మైండ్ వుంటే చాలు. అది కూడా లేదంటే నాకు పిచ్చి ఎత్తినట్లుగా వుంటుంది. ఇలాగే సాగిపోతే నేను ఎర్రగడ్డ చేరడానికి ఇంకెంతోకాలం పట్టదు''

నా 'కుండ' కళ్ల నుంచి, ముక్కు నుంచి లీక్ ప్రారంభమయిందని నేను ప్రత్యేకంగా ఇక్కడ ప్రస్తావించనవసరంలేదు. ''మన మధ్యలో ఎలాంటి అభిప్రాయ వ్యత్యాసాలు లేవు. ఎలాంటి గొడవ కూడా లేదు. ఊరికే కూర్చుని ఏవో ఆలోచించి వాటిని పెద్దవి చేయడంవల్లనే మనశ్శాంతి పోతుంది. ఉన్నదాంట్లో తృప్తిపడి లాగే మనస్సుకు కళ్లాలువేస్తేనే సుఖం వుంటుంది. ఈ సుఖం, శాంతి అనేవి ఒక మనిషి స్వయంగా అలవర్చుకోవలసినవి. అవి వడ్డించి పెట్టడానికి ఎవరివల్లా కాదు. దానిని డబ్బిచ్చి కొట్లో కొనడానికి వీల్లేదు. అందుకే







## భార్య భయం...!

*సాధారణంగా హిందీ నటులకు భార్యలంటే తగని భయం...! నేనే సిచ్చినేషాలు తమ భార్యలకు తెలిస్తే ఎక్కడ కొంపలంటుకుంటాయోనని రహస్యంగా నేసినా పత్రికలు బయటపెడుతూనే వుంటాయి...! షారుఖ్ ఖాన్‌కు భార్య గారి అంటే వచ్చేంత భయం...! ఈ మధ్య ఓ పార్టీలో గుండెల మీద సంతకం పెట్టమని అడిగిన ఓ కన్నెపిల్లకి గొడవాటుకు లాక్కెళ్ళి పెట్టాడట. భార్య గారి ఈ విషయం తెలియక పదిమందికి తన భర్త శ్రీరామచంద్రుడని చెప్పిందట...!*

—కృష్ణారే



జీవితాన్ని స్వయంగా సమీక్షించుకో. బాగా ఆలోచించు. అంతఃర్ముఖం చేసుకుని చూడు. బాహ్యం వైపు కాదు. జీవితంలో ప్లస్‌లు ఏంటి? మైనస్‌లు ఏంటి?అవి సరిగ్గా గణించు. అసంతృప్తినే మనస్సు నుంచి తొలగించు. మనల్ని మనపై వాళ్లతో కాక కింది వాళ్లతో పోల్చుకుంటే మన మీద దేవుడెంత దయ చూపించాడో అర్థం అవుతుంది. ఎంత డబ్బున్నా, ఎన్ని సౌకర్యాలు వున్నా దాన్నిబట్టి సుఖంరాదు. దానికి మనసును స్వయంగా కండిషన్ చేసుకోవాలి. సంతోషం కోసం ఏమయినా చదువు. రాయి, మంచి పాటలు విను. మెడిటేషన్ చెయ్యి, మంచి కలలు కను. ఉన్నదానికంతా దేవునికి కృతజ్ఞతలు చెప్పు. అందరికీ సుఖం ప్రసాదించాలని దేవుణ్ని ప్రార్థించు...''

వేదాంత శిఖరాలకు నా వాచాలతా పక్షాలు నన్ను చేర్చాయి. కానీ...

''ఆపండి. ఆపండి. చాలు... చాల నేను కూడా ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్ అనే విషయం మీరు మర్చిపోవద్దు. ఈ వేదాంతం, తర్కశాస్త్రం నేనూ చదువుకున్నాను. కానీ మీ నాలికంత పదునుకాదు నా నాలిక. ఏది అడిగినా తిరిగి నాకు ఉపన్యాసం ఇయ్యడానికి మీకు బాగా చేతనవును. కానీ ఉపన్యాసాలతో అన్ని పనులు జరుగుతాయా? ఏదయినా చేసి చూపాలి కదా. నేను చెప్పేది ఏదయినా చెయ్యడానికి మీరు సిద్ధంగా వున్నారా? మనసు లోపల వున్న శరీరం ఇదని తెలుసుకునే మనసు మీకుందా? లేక ఈ ఇంట్లో వున్న ఫర్నిచర్‌లాగే నన్ను ట్రీట్ చేయడమేనా మీ ఉద్దేశ్యం?'' అని అంటున్న ఆమె కోపాన్ని చూసి నేను మనసులో అనుకున్నాను.

కుమ్మడానికి వస్తున్న అడవిదున్నకు ఎదురుగుండా వేద పారాయణం చేయడం తెలివితక్కువ అని.

ఇలాంటి డిస్కషన్లు, డిస్కార్షులు చాలా జరిగాయి. కానీ మా దాంపత్య నౌక అటు ఇటూ ఊగుకుంటూ సాగింది. కానీ ఎప్పుడూ బోర్లా పడలేదు. ఇరవై సంవత్సరాలలో ఇలాంటి వర్షాలు, తుఫాన్లు, కల్లోలాలు రాకుండా వుంటేనే ఎవరయినా ఆశ్చర్యపడాలి.

కలహాలు ఎంత తీవ్రమైనా నన్ను వదిలి ఒక్కసారి కూడా ఆమె పుట్టింటికి వెళ్లలేదు.

ఆ విధంగా తీపి, చేదు, కారం, పులుపు కలిసిన మా జీవితం సంసార సాగరంలో ప్రయాణం చేస్తుండగా ఆకస్మికంగా...

నా కుండ మాతృకలశం అంత పెద్ద వయసేం లేదు. తనకంటె వయసులో చాలా ఎక్కువయిన తన 'పట్టి'ని ఏకాకి చేసింది. ఆయన తన నలుగురు కొడుకుల దగ్గర వుండడానికి ప్రయత్నం చేసాడు. ఎక్కడా వారికి కావాల్సినంత సుఖం దొరకలేదు.

''నాన్నగారికి ఈ వయసులో కొంత మనశ్శాంతి లభించాలంటే మన దగ్గరకు వచ్చి వుండక తప్పదు. ఎప్పుడయినా కోడలు కూతురు కాలేదు కదా!'' అని మొదలుపెట్టి మరి కొన్ని సమర్థనలను వాటికి జోడించింది. ఆమె చెప్పింది వింటున్నప్పుడు, విన్నాక నాకు వ్యతిరేక భావమేమీ కలగలేదు. కానీ...

''నీకు కావాల్సినంత సుఖం, సంతోషం ఇవ్వలేని నేను నీ వయస్సు మళ్లిన తండ్రికి ఇవ్వగలనా?'' అని అడగకుండా వుండలేక అడిగేసాను. ఆమె కళ్లల్లోకి బోలెడంత తడి వచ్చింది.

''మీరు ఎంత గొప్ప వ్యక్తో నాకు అర్థం కాలేదని మీరనుకుంటున్నారా? నాన్నగారు రావడంలో నాకంటె ఎక్కువగా సంతోషించేది మీరు, మన పిల్లలు అని నాకు బాగా తెలుసు. ఇప్పుడు ఒక విషయం నేను ఖచ్చితంగా చెప్తున్నాను. ఇప్పటినుంచి నా సుఖం గురించిగానీ, నా దుఃఖం గురించిగానీ నేనేం మాట్లాడను. నాన్నగారికి చాలా వయస్సు మళ్లిందికదా! అమ్మ బతికి వుంటే ఆయనకెలాంటి ఇబ్బంది వుండేదికాదు. అమ్మను పోగొట్టుకున్న దుఃఖంలో వున్నారు. పాపం ఆయనకు అమ్మ లోటు కనిపించకుండా చూసుకుందాం. లెట్ హిమ్ నాట్ ఫీల్ లోన్లీ...

ఆయన అవసాన దశలో కావాల్సిన సేవలు చేయడంకంటే నాకు ఇంక వేరే అదృష్టం ఏముంది? నాన్నగారు వచ్చాక మన మధ్య ఎలాంటి పోట్లాట వుండదు. ఏమయినా ఏ పోట్లాటకయినా కారణం నేనుకాను. ఆయన ఇక్కడ వున్నప్పుడు ఆయనకు ఎలాంటి బాధ కలగకుండా వుంటానికి మనమంతా కలసి ప్రయత్నం చేయాలి. మన స్క్రీన్‌లో ఎక్కువ భాగం ఇమాజినరీ స్క్రీన్ అని నేను ఒప్పుకుంటున్నాను. కానీ నాన్నగారిది ఇమాజినరీ స్క్రీ కాదు. ఇంక ఎలాంటి అరమరికలు లేకుండా మనం వుందాం''.

గౌతమ బుద్ధునికి కలిగిన జ్ఞానోదయం మాదిరి ఈ స్త్రీ 'బుద్ధు'కు కలగడంవల్ల వచ్చిన 'వెరీ లేట్ రియలైజేషన్'కు నేను బాగా సంతోషించాను. దేవుడికి నేను కృతజ్ఞతలు తెలిపాను.

కుండ వెళ్లి తండ్రి పాత్రని తీసుకుని వచ్చింది. ఇక్కడ కథా కథనం ముగించడానికి తగిన వాక్యమేంటి?

తదనంతరం వాళ్లు హాయిగా చిరకాలం జీవించారు అనేకదా!

నా కుటుంబ విషయంలో ఈ వాక్యంలోని ప్రతి అక్షరమూ నిజమయింది.

ఇప్పుడు వాళ్లు సుఖంగా, సంతోషంగా బతుకుతున్నారు. ఇంతకూ వాళ్లంటే ఎవరు? వేరే ఎవరు కాగలరు?

నా కుండ, కుండపిత తప్పించి?

ఆయన శ్రవణ శక్తి లోపంవల్ల పొద్దున మొదలుకొని రాత్రి నిద్రపోయేదాకా ఎన్నిసార్లు పిలుంటే అన్నిసార్లు తన గొంతు ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ నా 'కుండ' సాయుజ్యాన్ని పొందుతోంది.

ఆ సాయుజ్యాన్ని మరింత పెంచడానికి ఆ 'ప్రియ' పిత ఆమె ఒక్కొక్క ఉక్తికి పదిసార్లు... ఒక చెవి ముందుకు వంచి ''ఆ! ఆ'' అంటూ దానికి మద్దతు ఇస్తుంటారు.

తండ్రికి ఎల్లవేళలా కూతురు దగ్గరే వుండాలి. ఉన్నది ఒకటే కూతురు కదా! ఆమెకు తండ్రిపట్ల సేవాభిలాష దినదినాభివృద్ధి అవుతోంది. తండ్రిగారి ఆరోగ్యం, ఆనందమే ఆమెకు 20 సూత్రాల కార్యక్రమం అయింది. ఆ రెండు అంశాలకు దశముఖ ప్రయత్నాలు మనసా, వాచా, కర్మణా చేయడం తన ధర్మమని ఆమె భావిస్తోంది.

వారి వార్తా మార్పిడి, సంపీఠ యత్నాలు నాకు చాలా వినోదం కలిగిస్తున్నాయి. ఆ శ్రవణ, భాషణ ప్రయత్నాల స్థాయి తారాస్థాయి కంటె ఎక్కువయి నా వారి బహుముఖమైన చర్చా విషయాలు ఎవరికయినా ఉల్లాసం కలిగిస్తాయి. క్రికెట్, ఎలక్షన్, రైలు ప్రమాదాలు, ఎయిర్‌బస్ పంట పొలాల్లో దిగడం మొదలగునవి మామూలుగా మాట్లాడే విషయాలే అయినా చర్చ తీవ్రంగా జరిగేది. చౌరీశ పీవే, మైకేల్ జాక్సన్, టి.ఎన్.శేషన్, వరల్డ్ బ్యూటీ కాంటెస్ట్, టీవీలో వచ్చే బూతు సినిమాలు మొదలగువాటి మీదనే.

ఇదంతా అయ్యాక నా 'కుండ'కు మిగిలివున్న చాలా తక్కువ ఖాళీ సమయంలో నాతో జరపవలసిన తట్టు, అంటు కార్యక్రమం మంద్ర స్థాయిలో ఈ రోజు కూడా జరుగుతున్న విషయంలో నేను తృప్తి పొందకుండా వుండడానికి వీల్లేదన్నది కూడా నిజమే.



బుద్ధి

''ఈ పెద్దవాళ్లందరిదీ పాడుబుద్ధి'' అన్నాడు సందీప్.

''ఎలా చెప్పగలవు?'' అడిగాడు వంశీ.

''బాగా చదివి ఏ కలెక్టరో అయితే అది వంశపారంపర్యంగా వచ్చిందంటారు. అదే ఏ దొంగనో అయితే మా కడుపున చెడబుట్టావంటారు!'' కోపంగా అన్నాడు సురేష్.

—పి.వి.మురళీకృష్ణ
(హైదరాబాద్)